"ఈ చిలుకని, పంజరాన్ని నాకు అమ్ముతావా?" అడిగాను.

"మీరేం చేసుకుంటారు?" ఆశ్చర్యపోయాడు వాడు.

"చెప్పు. ఎంతకి అమ్ముతావు?" అడిగాను.

"వెయ్యి రూపాయలు." నేను కొననను కుని చాలా ఎక్కువ ధర చెప్పాడు వాడు.

నేను నా జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి వాడికి ఇచ్చి, ఈ పంజరాన్ని అందులోని చిలకతో సహా కొన్నాను. ఓ మామిడి తోపులోకి వెళ్ళి దాన్ని అక్కడ విడుదల చేసాను. ఇప్పుడు మీకు కొన్ని ప్రశ్నలు. ఈ పంజరంలో చిలుక ఉన్నప్పుడు దీని విలువ వెయ్యి రూపాయలు. ఇప్పుడు చిలుక లేకపోయినా ఈ పంజరం విలువ తరిగిందా? లేక పెరిగిందా?"

"పెరిగింది." భక్తులు జవాబు చెప్పారు.

ఆ మఠాధికారి దాన్ని కాళ్ళ కింద వేసి తొక్కి అది పనికిరాకుండా చేసి అడిగాడు.

"ఇప్పుడు?"

"ఇంకా పెరిగింది." చెప్పారు భక్తులు.

"మనం చేసే ప్రతీ పనీ ఈ పంజరం లాంటిది. దాన్లో చిలుకని ఉంచితే అది మన విలువని తగ్గించేస్తుంది. చిలుకని విడుదల చేసి, పంజరాన్ని మరెవరూ ఉపయోగించకుండా నాశనం చేస్తే మన విలువ పెరుగుతుంది. ఇదే నేను ఇవాళ మీకు చెప్పాలనుకున్న ప్రవచనం." వివరించాడా మఠాధికారి.

## 83. లోకం చూసేది

పెళ్ళిళ్ళు జరిపించడానికి ఇద్దరు పురోహితులు తరచు కాశీ నించి సమీపంలోని రామ్‌పూర్‌కి వెళ్ళేవారు. వెళ్ళినప్పుడల్లా వాళ్ళు కాశీరాం అనే అతని ఇంట్లో బస చేసేవారు. కొన్నేళ్ళ తర్వాత వాళ్ళు ఖరీదైన రథంలో రామ్‌పూర్‌కి చేరుకున్నారు. అంతదాకా ఆ ఇద్దర్నీ పట్టించుకోని ఆ గ్రామ కరణం వారి దగ్గరకి వచ్చి చెప్పాడు.

"ఇంతకాలం మీరు కాశీరాం ఇంట్లో బస చేస్తున్నారు. ఈసారి మా ఇంట్లో బస చేయండి."

జ్ఞానులైన ఆ ఇద్దరు పురోహితులు నవ్వి ఇలా చెప్పారు.

"మీరు మమ్మల్ని పూర్వం కన్నా అధికంగా గౌరవించడానికి మాలో ఏ మార్పు రాలేదు. కొత్తగా వచ్చినదల్లా ఆ రథం. కాబట్టి కావాలంటే మీరు వాటికి కట్టిన రెండు గుర్రాలని మీ అతిథులుగా తీసుకువెళ్ళి మమ్మల్ని ఎప్పటిలా కాశీరాం ఇంట్లో బస చేయనివ్వండి."

లౌకికులు బాహ్యాన్ని చూస్తారు. జ్ఞానులు అంతర్గత విషయాన్ని చూస్తారు.

## 84. మూడు ప్రశ్నలు

ఓ నవాబుకి మూడు ఆధ్యాత్మిక ప్రశ్నలు ఉదయించాయి. వాటిని తన దివాన్‌ని అడిగాడు. ఆయన తృప్తికరమైన సమాధానాలు చెప్పలేకపోయాడు.

"ఖాజీనే వీటికి సరైన సమాధానాలు ఇవ్వగలుగుతాడు." దివాన్ సలహా ఇచ్చాడు.

వెంటనే ఆయన దర్గా నించి ఖాజీని పిలిపించి అడిగాడు.

"నా మూడు ప్రశ్నలకి మీరు సమాధానాలు చెప్పగలరా? ముందుగా దేవుడు ఎక్కడ వుంటాడో చెప్పండి."

"అలాగే. ముందుగా నాకు కాస్త పాలు తెప్పించండి." కోరాడు ఖాజి.

అవి రాగానే జవాబు చెప్పాడు ఖాజి.

"ఈ పాలలో వెన్న ఎక్కడ వుందో మీరు చెప్పగలిగితే, నేను దేవుడు ఎక్కడ వుంటాడో చెప్తాను."

"ఓహో! దేవుడు అంతటా వున్నాడన్న మాట. సరే. దేవుడు ఎటువైపు చూస్తూంటాడు?" ప్రశ్నించాడు నవాబు.

వెంటనే ఖాజీ ఓ కొవ్వొత్తిని తెప్పించి వెలిగించి జవాబు చెప్పాడు.

"ఈ కొవ్వొత్తి వెలుగు ఎటువైపు ప్రసరిస్తోందో చెప్తే, దేవుడు ఎటువైపు చూస్తున్నాడో మీకు జవాబు చెప్తాను."